09012025-DIS-04_Layout 1 1/9/2025 2:52 AM Page 1





'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## రైతుల పోరాటం ఉధృతం

*కాలగర్భంలో కలిసిపోయిన 2024 సంవత్సరం మరో రైతు పోరాటానికి తెరతీసింది. గత ఏడాది ఫిబ్రవరి 14 నుంచి పంజాబ్ రైతులు హర్యానా సరిహద్దుల్లోని శంభు-అంబాలా, అఖౌరీ-జింద్ కూడళ్ల వద్ద బైఠాయింపు జరుపుతున్నారు. మరో నెల రోజుల్లో ఈ బైఠాయింపు ఏడాది పూర్తి చేసుకుంటుంది. ఈ పోరాటం 2020-21లో ఢిల్లీ శివార్లలో జరిగిన సుదీర్ఘ బైఠాయింపును అనివార్యంగా గుర్తు చేస్తున్నది. పైగా అప్పుడు మూడు నల్ల వ్యవసాయ చట్టాలను వెనుకకు తీసుకునే సందర్భంలో కేంద్ర పభుత్వం చేసిన వాగ్దానాలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, రైతుల ఆత్మహత్యలకు కారణమవుతున్న పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని కోరుతున్నారు. అంతిమంగా ఢిల్లీని మరోసారి చుట్టుముట్టి ఆందోళనను ఉధృతం చేయాలనేది పంజాబ్ రైతుల ఆలోచన. ఒక పోరాటానికి లొంగిపోయిన సర్కారు ఇచ్చిన హామీల అమలుకు మరో పోరాటం చేయాల్సి రావడం విడ్డూరం. అంతే కాకుండా ఉపసంహరించుకున్న చట్టాల్లోని రైతు వ్యతిరేక అంశాలనే మార్కెటింగ్ ఫ్రేమ్‌వర్క్ పేరిట మరో రూపంలో తీసుకురావడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే.*

*ఓ వైపు సరిహద్దుల్లో బైఠాయింపు కొనసాగుతున్న నేపథ్యంలో రైతుల డిమాండ్ల కోసం ప్రముఖ రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ ఢల్లీవాల్ ఆమరణ నిరాహార దీక్ష మొదలుపెట్టడంతో పోరాటం కొత్త మలుపు తిరిగింది. ఆ దీక్ష 40 పైచిలుకు రోజులుగా ఖనౌరీలో సాగుతున్నది. గతంలో నాలుగుసార్లు నిరాహార దీక్ష చేసినప్పటికీ ఈసారి గమ్యాన్ని సాధించడమే లక్ష్యంగా ఆమరణం చేపట్టడం, అది సుదీర్ఘంగా సాగుతుండటం దేశవ్యాప్తంగా, ముఖ్యంగా రైతాంగంలో ఆందోళన కలిగిస్తున్నది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని సూచించినా వారితో చర్చలకు ముందుకు రాకపోవడం కేంద్ర ప్రభుత్వానికి రైతుల పట్ల గల ధోరణికి అద్దం పడుతున్నది. గత డిసెంబర్‌లో ఢల్లీవాల్ కేంద్రానికి రాసిన ఓ బహిరంగ లేఖలో రైతులకు కనీస మద్దతు ధర అనేది ప్రాథమిక జాబితా కిందకు వచ్చే పౌరుల జీవించే హక్కుతో సమానమని నొక్కిచెప్పడం గమనార్హం.*

*ఆరుగాలం కష్టించి పండించే పంటకు ఏ ధర లభించేదీ అగమ్యగోచరం అవుతున్న స్థితిలో నుంచి రైతుల ఆందోళన ఆవిర్భవించిందనేది వాస్తవం. ఇది ఒక్క పంజాబ్ రైతుల డిమాండే కాదు, దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లోని రైతులు కోరుకునేది ఇదేనని చెప్పాలి. సాగును కార్పొరేట్ల పరం చేయాలని చూస్తున్న కేంద్ర పభుత్వం అందుకు సానుకూలత చూపడం లేదు. రైతుల ప్రయోజనాల రీత్యా ఇప్పటికైనా కేంద్రం దిగిరావాల్సి ఉన్నది. మూడు చట్టాలను వెనుకకు తీసుకొని రైతులకు క్షమాపణ చెప్పింది మరోసారి మోసం చేసేందుకు కాదని ప్రజలకు, ముఖ్యంగా రైతులకు తెలియజెప్పాల్సి ఉన్నది. అందుకు అన్నదాతలతో చర్చలు జరపడం ఒక్కటే ఏకైక పరిష్కారం. రైతుల పోరాటం అంతకంతకూ ఉధృతమవుతున్న నేపథ్యంలో ఢల్లీవాల్ వంటి వృద్ధ రైతు నేత ఆత్మార్పణకు సిద్ధపడ్డ పస్తుత తరుణంలో ఇది తక్షణావసరమని చెప్పక తప్పదు.*

# పరిపాలనపై పట్టులేని రేవంత్

**హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలోకి రేవంత్‌రెడ్డి ప్రవేశించగానే తెలంగాణ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌కు స్వాగతం అని వేదికపై ఉన్న యాంకర్ ఆహ్వానించారు. పేరు మర్చిపోవడం, తప్పుగా పలకడం మహాపరాధమేమీ కాదు. ఇదే మొదటిసారీ కాదు. అయితే దీనిపై సామాజిక మాధ్యమాల్లో చాలా హడావుడి జరిగింది. చివరికి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలుగు మహాసభలో తెలంగాణ ముఖ్యమంత్రి పేరు మర్చిపోవడం వెనుక పెద్ద కుట్ర ఉన్నదని అనుమానం వ్యక్తం చేశారు.**



**బుద్దా మురళి**



పుష్ప సినిమా ఫంక్షన్‌లో నటుడు అల్లు అర్జున్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి అంటూ రేవంత్‌రెడ్డి పేరు గుర్తు రాక వదిలేశారు. ఆ తర్వాత సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట, అల్లు అరెస్ట్, శాసనసభలో నటుడిపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సినిమా పెద్దలు వెళ్లి సీఎంను కలవడంతో ఆ వివాదం సద్దుమణిగింది. అల్లు అర్జున్ తన ప్రసంగంలో సీఎం పేరు మర్చిపోవడం వల్లనే ఈ ఘర్షణ అని ప్రచారం సాగింది. తెలుగు సభల్లో సీఎం పేరు మర్చిపోయిన యాంకర్ కూడా నటుడే. కాబట్టి, ఈ హీరో అరెస్ట్ కూడా తప్పదా? అని సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. 'మొగుడు కొట్టినందుకు కాదు, తోటి కోడలు నవ్వినందుకు' అన్నట్టు ఒకవైపు యాంకర్ సీఎం పేరు మర్చిపోవడం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటే, మరోవైపు వేదిక పైకి రేవంత్ వస్తుంటే అప్పటికే వేదికపై కూర్చున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వంటి మంత్రులు అలానే కూర్చొని ఉన్నారు. ఒకవైపు తెలుగు సభల వీడియో, మరో వైపు సీఎం వస్తున్నా మంత్రులు అలానే కూర్చున్న వీడియో.. ఈ రెండూ వైరల్ కావడంతో ఎంపీ చామల లాంటి వారు స్పందించి సీఎం పేరు మరిచిపోవడం యాదృచ్ఛికంగా జరిగింది కాదని, ఏదో కుట్ర ఉన్నదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

> **నెల రోజులు మాత్రమే సీఎంగా పనిచేసిన నాదెండ్ల భాస్కరరావు పేరు కూడా మరిచిపోరు కానీ, ఏడాది నుంచీ సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి పేరు గుర్తురావడం లేదంటే ఆలోచించాల్సిందే. మంత్రులు లేవకపోవడం, పేరు మర్చిపోవడం యాదృచ్ఛికం కావచ్చు, ఉద్దేశం ఏదైనా కావచ్చు కానీ, ఒక్క ఉచిత బస్సు తప్ప కాంగ్రెస్ పాలనలో ప్రజలపై పాజిటివ్ ప్రభావం చూపే నిర్ణయాలు లేవు. రేవంత్ రెడ్డి తన పాలనతో ప్రజలపై బలమైన ముద్ర వేయలేదనేది నిజం.**

అదే కాంగ్రెస్ పార్టీకి చెందిన వైఎస్ఆర్, టీడీపీ అధినేత చంద్రబాబు, తెలంగాణకు సంబంధించి కేసీఆర్ ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు ఇలాంటి దృశ్యాలు ఊహించలేం, జరగలేదు కూడా. పార్టీ మీద, ప్రభుత్వం మీద వారికి అంతటి పట్టు ఉండేది. ఎన్టీఆర్‌ను దించి బాబు సీఎం అయిన కొత్తలో ఎంపీగా ఉన్న వడ్డే శోభనాద్రీశ్వరరావు టెలికాన్ఫరెన్స్‌లో బాబు అని పేరు పెట్టి పిలిస్తే బాబు ఆయన్ని కట్ చేసి దూరం పెట్టారు. తనను అలా పేరు పెట్టి పిలువవద్దని సున్నితంగా మందలించారని ఆ మధ్య కర్నూలు జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. సుబ్బారెడ్డి, వడ్డే శోభనాద్రీశ్వరరావు లాంటి వారు రాజకీయాల్లో, టీడీపీలో బాబు కన్నా సీనియర్లు. అయినా, సీఎం పోస్ట్‌లో ఉన్న వారి పట్ల హుందాగా ఉండాలి. రేవంత్‌రెడ్డి విషయంలో అటు ప్రజల్లో, ఇటు సొంత పార్టీలో, మంత్రుల్లో ఆ గౌరవం కనిపించడం లేదు. రేవంత్‌రెడ్డి పార్టీలో అందరి కన్నా జూనియర్ కావడంతో తలెత్తుతున్న సమస్య ఇది.

సీఎం పదవి చేపట్టిన కొత్తలో శాసనసభలో రెండు విషయాలు చెప్పారు. తాను కేసీఆర్‌ను కాదని, ఆయన ఆనవాళ్లు అన్నీ చెరిపేస్తానని ప్రకటించారు. బోలెడు డబ్బు ఖర్చుచేసి టీఎస్ అని ఉన్న చోటల్లా టీజీ అని పేరు మార్చారు. అయితే మంత్రులు ఇప్పుడు కూడా 'టీజీ ఆర్టీసీ' అని కాకుండా ట్విట్టర్‌లో 'టీఎస్ ఆర్టీసీ' అనే రాస్తున్నారంటే పేరు మార్పు ఎలాంటి ఫలితం ఇచ్చిందో అర్థం చేసుకోవచ్చు. ఏపీ, తెలంగాణ మీడియాలోనే కాకుండా చివరికి మహారాష్ట్ర మీడియాలో సైతం రూ.వందల కోట్ల ఖర్చుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోలతో పేజీలకు పేజీలు ప్రకటనలు ఇచ్చినా ప్రజల దృష్టిలో సీఎంగా నిలబడకపోవడం గమనార్హం. ప్రపంచంలోని తెలుగువారందరికీ ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకొనే ప్రపంచ తెలుగు సమాఖ్య తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో నిర్వహించిన ముగింపు సభలో సీఎం స్వయంగా పాల్గొన్నా ఆయన పేరు గుర్తుకురాక కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు చెప్పారంటే ఇక సామాన్యులకు ఏ విధంగా గుర్తు ఉంటుంది.

> **తాను కేసీఆర్ లాంటి నాయకుడిని కాదని రేవంత్‌రెడ్డి చెప్పుకొంటారు. సీఎం అనే కాదు, ప్రపంచంలో ప్రతి వ్యక్తికి ప్రత్యేకత ఉంటుంది. ఎవరూ మరొకరు కారు. ఒక సభలో ఓషో యోగా గురించి చెప్తూ వందకోట్ల మంది భారతీయులు ఉన్నప్పుడు వంద కోట్ల రకాల యోగా పద్ధతులు ఉండాలని, ప్రతి మనిషి ప్రత్యేకమేనని అంటారు.**

అదేవిధంగా ప్రతి ముఖ్యమంత్రికి తమ ప్రత్యేకతలు తమకు ఉంటాయి. ఎవరూ ఇంకొకరి లాంటి వారు కాదు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ నాయకుడే అయినా వైఎస్సార్ పార్టీలో సుదీర్ఘ కాలం పోరాటం చేసిన తర్వాత ముఖ్యమంత్రి అయ్యారు. జాతీయ పార్టీ అయినా సీఎంగా ప్రాంతీయ పార్టీ నాయకుడిలా అధికారం చెలాయించారు. ప్రభుత్వంపైనా, పార్టీ పైనా పట్టు సాధించారు. సాధారణంగా కాంగ్రెస్‌లో సోనియాగాంధీ చెప్పారంటే ఏ నాయకుడైనా దాన్ని పాటించాల్సిందే. కానీ, వైఎస్సార్ సీఎం అయ్యాక పి.జనార్దన్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని సోనియా సిఫారసు చేస్తే వైఎస్ మాత్రం పట్టించుకోలేదు. సోనియా తిరిగి అడగలేదని గాలి ముద్దుకృష్ణమనాయుడు ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ లాబీలో మీడియాతో జరిగిన ఇష్టాగోష్ఠిలో చెప్పారు. పార్టీలో, ప్రభుత్వంలో వైఎస్సార్ పట్టు అంత బలంగా ఉండేది. చంద్రబాబు ప్రాంతీయ పార్టీ నాయకుడు కాబట్టి ఆయన ఇష్టం. అదే విధంగా ఉద్యమానికి నాయకత్వం వహించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కాబట్టి ప్రభుత్వంపై, పార్టీపై కేసీఆర్‌కు పూర్తి పట్టు ఉండేది.

కేసీఆర్ పట్టుబట్టి తెలంగాణ సాధించారని 'మహా టీవీ' ఇంటర్వ్యూలో స్వయంగా రేవంత్ రెడ్డే చెప్పారు. అప్పుడు ఆయన టీడీపీలో ఉన్నారు. కాబట్టి, కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడానికి అదేమన్నా గాంధీభవన్ గోడల మీదున్న మరకలా? సున్నం వేస్తే కనిపించకుండా పోవడానికి? ఉధృతంగా సాగిన తెలంగాణ ఉద్యమ చరిత్రను ఎలా మలిపేస్తారు?

సాధారణంగా కాంగ్రెస్ పార్టీలో సీఎంను ఎంపిక చేయాల్సిన సమయంలో ఎంత రాజకీయం జరిగినా అధికారిక ప్రకటన మాత్రం ఏకగ్రీవంగా ఉంటుంది. ఫలానా వారిని సీఎల్పీ నాయకుడిగా ఎన్నుకున్నట్టు ప్రకటిస్తారు. కానీ, తెలంగాణలో తొలిసారి దీనికి భిన్నంగా జరిగింది. అప్పుడు సీఎల్పీ నాయకుడి ఎన్నిక వ్యవహారం చూసిన వేణుగోపాల్.. రేవంత్‌రెడ్డిని సీఎల్పీ నాయకుడిగా ఎన్నుకున్నట్టు ప్రకటిస్తూనే సీఎంగా ఏకపక్ష నిర్ణయాలుండవని, అందరితో చర్చించి సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటారని ప్రకటించారు. పార్టీలో ఉన్న అందరూ రేవంత్ కన్నా సీనియర్లే కావడం వల్ల వారిని కూడా సంతృప్తి పరచాల్సిన పరిస్థితి కాంగ్రెస్ హై కమాండ్‌ది.

పేరు చెరిపేస్తా అంటూ ప్రకటనలు చేసిన రేవంత్ పేరే సీఎంగా గుర్తుకురాకపోవడం బాధాకరం. అది ఆయనకే కాదు, తెలంగాణకే అవమానం. సంక్షేమ పథకాలే కాదు, తెలంగాణ పేరెత్తినా కేసీఆర్ గుర్తొస్తారు. రైతుబీమా, రైతుబంధు, కల్యాణలక్ష్మి వంటి పథకాల పేరు వినగానే కేసీఆర్ మదిలో మెదులుతారు. రేవంత్‌రెడ్డి కూడా తనకు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని పేరు నిలిచిపోయేవిధంగా, తెలంగాణ ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలి. దేశం గాంధీని గుర్తుంచుకుంటుంది, గాడ్సేనూ గుర్తుంచుకుంటుంది. విధ్వంసం ద్వారా కాకుండా నిర్మాణం ద్వారా తన పేరు గుర్తుండే విధంగా రేవంత్‌రెడ్డి నిర్ణయాలు తీసుకోవాలి.

> **పేరు చెరిపేస్తా అంటూ ప్రకటనలు చేసిన రేవంత్ పేరే సీఎంగా గుర్తుకురాకపోవడం బాధాకరం. అది ఆయనకే కాదు, తెలంగాణకే అవమానం. సంక్షేమ పథకాలే కాదు, తెలంగాణ పేరెత్తినా కేసీఆర్ గుర్తొస్తారు. రైతుబీమా, రైతుబంధు, కల్యాణలక్ష్మి వంటి పథకాల పేరు వినగానే కేసీఆర్ మదిలో మెదులుతారు. రేవంత్‌రెడ్డి కూడా తనకు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని పేరు నిలిచిపోయేవిధంగా, తెలంగాణ ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలి.**

# సీఎం ఎంపికలో చారిత్రక తప్పిదం

**పురాతన పార్టీగా పేరున్న కాంగ్రెస్ దేశంలోని మూడు రాష్ట్రాల్లో మాత్రమే సొంతంగా అధికారంలో ఉన్నది. వాటిలో దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక ఒకటైతే, అతికష్టం మీద అధికారంలోకి వచ్చిన తెలంగాణ రెండవది. పద్నాలుగేండ్ల పాటు ఉద్యమాన్ని నడిపించి, మరో పదేండ్లు ప్రభుత్వంలో ఉన్న బీఆర్ఎస్‌ను కాదని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. కానీ, ఆ పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి ఎంపికలో చారిత్రక తప్పిదం చేసినట్టు కనిపిస్తున్నది. రాష్ట్రంలోని మిగతా సీనియర్ నాయకులను కాదని ఓటుకు నోటు కేసులో చిక్కుకున్న రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోపెట్టడం ఆ పార్టీ చేసిన అతి పెద్ద తప్పిదంగా మారింది.**



**సుంకె రవిశంకర్**
79974 26666

కనీసం మంత్రిగా కూడా అనుభవం లేని రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో ముఖ్యమంత్రిగా ఎలాంటి మార్పులు తీసుకురాకపోగా రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల అరెస్టులు, సోషల్ మీడియా వ్యాఖ్యలపై పోలీసు కేసులు ఆ పార్టీ ప్రతిష్ఠను దిగజార్చుతున్నాయి. ముఖ్యంగా గత ప్రభుత్వంపై కక్షగట్టి కేసీఆర్, కేటీఆర్ లాంటి నాయకులపై ఉన్న కోపాన్ని తీర్చుకోవడానికి ప్రభుత్వాన్ని వాడుకుంటున్నారు. 'ఫార్ములా-ఈ' కార్ రేసు కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేయాలనే ఆతృతతో ఉన్న రేవంత్‌రెడ్డి ఎంతకైనా దిగజారేందుకు ప్రయత్నిస్తున్నారు. కేటీఆర్ లాంటి నాయకుడిని అరెస్టు చేసి ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను భయపెట్టాలని చూస్తున్న ఆయన ప్రయత్నాలు ఏ మాత్రం సఫలం కావడం లేదు. ఇవన్నీ కాంగ్రెస్ పరువును దిగజార్చుతున్నాయి. ఒక జాతీయ పార్టీ నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలా దిగజారడం ఇదే మొదటిసారి కావచ్చు. ఇలాగే తన వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ వైషమ్యాల కోసం ఇలాగే సమయం వృథా చేస్తే ఆ నష్టం కేవలం కాంగ్రెస్ పార్టీకే కాదు ఈ రాష్ట్ర ప్రజలకు కూడా జరుగుతుంది.

ఇక తెలంగాణ ఉద్యమ చిహ్నాలను, రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలను మార్చే ఉద్దేశంతో ఉన్న ఆయన మొదట రాజముద్రను మార్చాలని ప్రయత్నించి భంగపడ్డారు. తర్వాత టీఎస్ స్థానంలో టీజీని తీసుకొచ్చారు. ఇలా పేర్లు, చిహ్నాల మార్పులపై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఆయన జాతీయస్థాయిలో బీజేపీపై కాంగ్రెస్ చేస్తున్న పోరాటాలకు, విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన వైఖరితో జాతీయస్థాయిలో కాంగ్రెస్ పరువు పల్చనయ్యే అవకాశం ఉన్నది. ఇక, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు. ఇప్పటివరకు రుణమాఫీ పూర్తికాలేదు. దాని కోసం ఆశగా ఎదురు చూసిన రైతులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించి, ఇప్పుడు రూ.12వేలు మాత్రమే ఇస్తామని స్పష్టం చేశారు. ఇలా హామీలు ఇచ్చి అమలు చేయలేకపోతే రేవంత్‌రెడ్డి మాత్రమే వ్యక్తిగతంగా బాధ్యుడు కాదు, ఆ పార్టీ జాతీయ నాయకత్వం కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. లేదంటే తెలంగాణలోనే కాదు, మరే రాష్ట్రంలోనూ ప్రజలు ఆ పార్టీని నమ్మరు. అంతెందుకు మహారాష్ట్రలో కాంగ్రెస్ హామీలను ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణలో అమలు చేయని హామీలు తమకెందుకని అక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారు.



> **హామీల అమలుపై కంటే కక్ష రాజకీయాలపై దృష్టిపెడితే ఫలితాలు ఇలాగే ఉంటాయని గ్రహించిన ఆ పార్టీ మహారాష్ట్రలో కర్ణాటక, తెలంగాణ హామీల మాట ఎత్తొద్దని నాయకులకు నిర్దేశించింది. చివరికి కాంగ్రెస్ పార్టీ జరిపిన విజయోత్సవాలకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రావడానికి సుముఖత చూపలేదంటే రేవంత్ సారథ్యంలోని ఆ పార్టీ ఏ మేరకు విజయం సాధించిందో మనం అర్థం చేసుకోవచ్చు.**

ఈ ఏడాది కాలంలో అసలు తెలంగాణలో కనిపించదగిన మార్పేమీ రేవంత్‌రెడ్డి తీసుకురాలేకపోయారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్న ఆయన ఏడాది గడుస్తున్నా ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఏదైనా జాతీయ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే మిగతా రాష్ట్రాల్లోనూ చెప్పుకొని ప్రచారం చేసుకుంటుంది. కానీ, తెలంగాణ విషయంలో మాత్రం ఆ పార్టీ జాతీయ నాయకత్వం చెప్పుకోవడానికి సంకోచిస్తున్నది. మామూలుగా కాంగ్రెస్‌కు ముఖ్యమంత్రులను మార్చే అలవాటు ఉన్నది. కానీ, ఎదురుచూసి నిర్ణయం తీసుకుందామన్న ఆలోచనలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి రేవంత్ దూకుడు మనస్తత్వం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి.

అధిష్ఠానం సూచనలను తెలంగాణ పాలకులు ఏ మాత్రం పట్టించుకోవట్లేదన్న విమర్శలున్నాయి. మిగతా నాయకులతో అంటీముట్టనట్టు వ్యవహరించడం వల్ల ఆయనపై అధిష్ఠానం గతంలో సీరియస్ అయిన విషయం అందరికీ తెలిసిందే. రూ.15 వేల రైతు భరోసాపై వెనక్కి తగ్గడంపై క్యాబినెట్ సహచరుల సూచనలను ఆయన పట్టించుకున్నట్టు కనిపించలేదు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పుకొంటున్న రేవంత్‌రెడ్డికి ప్రతిపక్షాలు చేస్తున్న పోరాటాలకు ప్రజల మద్దతు విశేష స్థాయిలో ఎందుకు ఉంటుందన్న విషయాన్ని గ్రహించడం లేదు. లగచర్ల సహా ప్రతిపక్షాలు చేసే ఏ పోరాటాలకైనా ప్రజలు భారీగా మద్దతునిస్తున్నారు.

ఇందిరమ్మ రాజ్యం అంటే ఆమె అమలుచేసిన సంక్షేమ పథకాలా? లేదంటే ఆమె విధించిన ఎమర్జెన్సీనా? అన్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ ఆలోచించుకోవాలి. తెలంగాణలో ఎలాగూ విశ్వాసం కోల్పోయింది. ఇప్పటికైనా తెలంగాణలోని నాయకత్వానికి కాంగ్రెస్ అధిష్ఠానం సరైన మార్గ నిర్దేశం చేయకపోతే మిగతా రాష్ట్రాల్లోనూ ఆ పార్టీకి అదే గతి పడుతుంది. ఇందులో అనుమానం లేదు.


**(వ్యాసకర్త: మాజీ ఎమ్మెల్యే, చొప్పదండి)**

**'పాలకులకు చదివే తీరిక ఉండదు. కానీ, అధ్యయనం చేయనివారు ఉత్తమ పాలకులు కాలేరు' అన్నా డు ప్లేటో. నేడు మన దేశంలో అలాంటి ఉత్తమ పాలకులు కరువయ్యారు. భారతీయుల సుఖ జీవనం కోసం తమ ధన, మాన, ప్రాణాలర్పించి భరతమాతకు విముక్తి కల్పించారు స్వాతంత్ర్య సమరయోధు లు. కానీ, వారి ఆశయాలకు భిన్నంగా స్వతంత్ర భారతంలో సమన్యాయ పాలన జరగకపోగా నేటికీ కూడు-గూడు-గుడ్డ, విద్య-వైద్యాలకు దప్పిక గొన్న భారతీయులు కోట్లలో ఉన్నారనేది చేదు నిజం.**

# అధ్యయనశీలే పాలకుడైతే..



**పాతూరి వెంకటేశ్వరరావు**
**93490 81889**



దేశంలో నూతన ఆర్థిక విధానాలు ప్రవేశించిన 1990వ దశకం నుంచి ఆర్థిక అసమానతలు ఆకాశాన్నంటాయి. కొద్దిమంది కోటీశ్వరులు ప్రపంచ కుబేరులుగా ఎదుగుతుంటే, కోట్ల మంది పేదలు నిరుపేదలవుతున్నారు. ఉదాహరణకు.. జీఎస్టీ రీత్యా అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలో ఐదో స్థానానికి ఎదిగిన భారత్.. సామాన్యుల జీవన ప్రమాణాల రీత్యా 134వ స్థానానికి దిగజారింది. ప్రపంచ కుబేరుల రీత్యా పదో స్థానానికి ఎగబాకిన భారత్ పేదరికాన్ని నిర్మూలించుకున్న దేశాల జాబితాలో 113వ స్థానంలో నిలిచింది. ప్రపంచ బ్యాంకు తదితర సంస్థల సర్వేలు, ఐరాస నివేదికలు చెప్తున్న కఠోర వాస్తవాలివి.

ఏ దేశ ప్రగతి సాధనకైనా పాలకులు పాటించాల్సిన సూచనలను రూపొందించినందుకు 2024 నోబెల్ బహుమతి అందుకున్న ఆర్థికవేత్తలు డారెన్ అసిమోగ్లు, జేమ్స్ ఏ రాబిన్సన్, సైమన్ జాన్సన్ సూచనలు పరిశీలిస్తే, వాటిలో కొన్నింటినైనా పాటించి ఉన్న దేశాలే తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధిని సాధించినట్టు స్పష్టమవుతున్నది. వాటిలో స్టాలిన్ కాలంలో రష్యా, డెంగ్ జియావో పింగ్ హయాంలో చైనా, కేసీఆర్ పాలనలో తెలంగాణ ఉన్నాయి. అధ్యయనశీలురైన నేతల ప్లానింగ్ వల్లనే అనతికాలంలో అత్యధిక ప్రగతిని సాధించగలిగాయి.


కేసీఆర్ కూడా ఇంచుమించు ఇలానే రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించారు. అనుభవం, చూడటం, వినడం, చదవడం ద్వారా అపార రాజకీయ, ఆర్థిక పరిజ్ఞానాన్ని సముపార్జించుకున్న రాజనీతిజ్ఞుడు కేసీఆర్. డెంగ్‌జియాంగ్ లానే బడ్జెట్‌లో అత్యధిక నిధులను వ్యవసాయరంగానికి కేటాయించారు. 'మిషన్ కాకతీయ' ద్వారా కాలువలు, చెరువులు, రిజర్వాయర్లు నిర్మించారు. 100 శాతం సాగునీటి వనరులను పెంపొందించుకున్న రాష్ట్రంగా 'నీతి ఆయోగ్' ప్రశంస అందుకున్నది తెలంగాణ. కేసీఆర్.. సాగునీటి రంగానికే పరిమితం కాలేదు. రాష్ట్రానికి వర్షాభావ పరిస్థితులు ఏర్పడకుండా ఉండేందుకు, 19 శాతానికి పతనమైన అడవులను ఐదేండ్లలో 27 శాతానికి పునరుద్ధరించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు, రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వగైరా ప్రోత్సాహకాలతో వ్యవసాయరంగాన్ని పరుగులు పెట్టించారు. కేసీఆర్ కృషి ఫలితంగా దేశంలోనే అత్యధిక వరిని పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఎదిగింది.

> **కార్పొరేట్ దవాఖానల గుత్తాధిపత్యం కొనసాగకుండా, వాటికి దీటుగా ప్రభుత్వ వైద్యరంగాన్ని మెరుగుపరిచారు కేసీఆర్. ప్రైవేటు విద్యాసంస్థల హవా కొనసాగకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రశంసనీయంగా మెరుగుపరిచారు. పదేండ్ల పాలనలో ఒక్క మత కల్లోలానికి కానీ, ఉగ్ర విధ్వంసానికి కానీ తావులేని ప్రశాంత పాలన అందించారు.**

గురుకులాలు, జిల్లాకో మెడికల్ కళాశాల, ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణాల ద్వారా, మానవ వనరుల ఉత్పత్తిని గణనీయంగా పెంచారు కేసీఆర్. ఆర్టీసీని ప్రైవేటు రవాణా వ్యవస్థతో పోటీపడేలా చేసి లాభాల బాట పట్టించారు. 'ఐటీ హబ్' ద్వారా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించారు. ఆశ్రిత పక్షపాతానికి తావులేని పారదర్శక నియామకాల ద్వారా సంస్థలను సమర్థవంతంగా, అవినీతి రహితంగా పని చేయించారు. సమర్థుల నియామకం, టెక్నాలజీ వినియోగం ద్వారా పోలీసు వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారు.

వర్తమాన భారత పాలక వర్గాలను పరిశీలిస్తే కొందరు కమ్యూనిస్టు నేతలు మినహా జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతల్లో కేసీఆర్ వంటి అధ్యయనశీలురు లేరన్న విషయం స్పష్టమవుతుంది. బీఆర్ఎస్‌పైనా, కేసీఆర్ పైనా కాంగ్రెస్, బీజేపీ కక్ష పెంచుకోవడానికి కారణం ఇదేనని అర్థం చేసుకోవచ్చు. ఈ వాస్తవాన్ని మననం చేసుకుంటూ తెలంగాణ ప్రజలు, మేధావులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది.

**(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)**




## "మా వాడి మాటలు నమ్మొద్దు"



**ఎలాన్ మస్క్ చెప్పేవి వినాల్సిన అవసరం లేదు. నా దృష్టిలో అతడో మామూలు మనిషి అంతే. కాకపోతే అతడి వద్ద డబ్బుంది. బిలియనీర్ కాబట్టి అతడేం చెప్పినా రీట్వీట్ చేస్తుంటారు. మస్క్ చెప్పే వాటిని పట్టించుకోకుండా బయటకు పొమ్మని చెప్పాలి అంతే...**

**- ఎర్రల్ మస్క్, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ తండ్రి**